సివిల్స్ ఉచిత లాంగ్ టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, జూన్ 18 : సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష 2025కు కోచింగ్ తరగతులు జూలై 18వ తేదీ 2024 నుంచి ఏప్రిల్ 18వ తేదీ 2025 వరకు టీజీ బీసీ స్టడీ సర్కిల్, లక్ష్మీనగర్ కాలనీ హైదరాబాద్‌లో ప్రారంభం అవుతాయని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇవ్వనుండగా అందులో 100 మందికి జూలై 7వ తేదీన నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. మరో 50 మంది అభ్యర్థులను ఇంతకు ముందు యూపీఎస్‌సీ వారు నిర్వహించిన సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకోనున్నట్లు తెలిపారు. సంబంధిత పత్రాలతో జూలై 3వ తేదీన నేరుగా టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08462-241055 ఫోన్ నంబర్‌ను లేదా నిజామాబాద్‌లోని సుభాష్‌నగర్‌లో ఉన్న నిర్మల హృదయ స్కూల్ ఎదురుగా ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

నల్లా కనెక్షన్ల వివరాలు నమోదు

బీబీపేట్, జూన్ 18 : మండల కేంద్రంతోపాటు మండలంలోని మాందాపూర్, ఇస్సానగర్, ఉప్పూర్‌పల్లి, మల్కాపూర్ ఆయా గ్రామాల్లో మంగళవారం మిషన్ భగీరథ కనెక్షన్లను ఇంటింటికీ తిరుగుతూ పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ కలిసి మిషన్ భగీరథ కనెక్షన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది.

నర్సరీ పరిశీలన

ఉగ్రవాయి గ్రామంలో ఉన్న నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీవో

కామారెడ్డి రూరల్, జూన్ 18 : కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో ఉన్న నర్సరీని ఎంపీవో మలహరి మంగళవారం పరిశీలించారు. అలాగే మిషన్ భగీరథ పనుల్లో భాగంగా ఇంటింటికీ వెళ్లి నల్లా కనెక్షన్ల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ శోభ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మాచారెడ్డి, జూన్ 18 : మాచారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపీబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు మధ్యాహ్నం 1 గంటలకు హాజరు కావాలని కోరారు.

లింక్ క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ

- బ్యాంకుల పేరిట రివార్డు లింక్ మెస్సేజ్‌లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



రివార్డ్ పేర్లతో వచ్చిన ఎస్బీఐ మెస్సేజ్

పెద్ద కొడప్‌గల్, జూన్ 18: వాట్సాప్‌లో కెనారా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రివార్డ్ లింక్‌తో వస్తున్న మెస్సేజ్‌లు వైరల్ అవుతున్నాయి. వాట్సాప్‌లో వచ్చిన రివార్డ్ లింక్‌ను ఓపెన్ చేశామా.. ఫోన్ డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుంది. 'ప్రియమైన వాల్యూ కస్టమర్.. మీ ఎస్బీఐ నెట్ బ్యాంకింగ్ రివార్డ్ పాయింట్లు రూ.9980 గడువు నేటితో ముగుస్తుంది. ఇప్పుడే ఎస్బీ రివార్డ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి..' అని సందేశం వస్తుంది. అది నిజమని నమ్మి లింక్ ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేస్తే ఖాతాదారుల అకౌంట్‌లో ఉన్న నగదు మాయం అవుతుంది. కెనారా బ్యాంక్ నుంచి వచ్చిన రివార్డ్ లింక్‌ను ఓపెన్ చేసినా అంతే సంగతి. 'మీ కెనారా బ్యాంక్ నెట్ బ్యాంకింగ్ ఖాతా, ఆధార్ నంబర్‌ని అప్‌డేట్ చేయకుంటే ఈరోజే ఖాతా బ్లాక్ చేయబడుతుంది. మీ కెనారా బ్యాంక్ కేవైసీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి. మీ డాక్యుమెంట్లు సరైనవో.. తప్పుగా ఉన్నాయో..? తనిఖీ చేసుకోండి' అని లింక్ మెస్సేజ్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసినా మీ ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కినట్లే. వాట్సాప్ గ్రూపుల్లో కూడా రివార్డు లింక్‌లు పోస్టు అవుతున్నాయి. దీంతో వందలాది మంది సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారు. మండలంలో పలువురు ఇలాంటి లింక్‌ను ఓపెన్ చేసి నగదును పోగొట్టుకున్నారు. విషయం తెలిసిన పలువురు అలాంటి లింక్ వచ్చిందంటేనే భయపడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

సోషల్ మీడియాలో వస్తున్న బ్యాంక్ రివార్డు లింకుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉచిత బహుమతులకు ఆశపడి నష్టపోవొద్దు. ఫోన్‌కు వచ్చే లింకులను ఎట్టిపరిస్థితుల్లో క్లిక్ చేయొద్దు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటీపీలు అడిగితే చెప్పొద్దు. బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి ఎలాంటి ఘటనలు జరిగినా.. వెంటనే బ్యాంక్ వారిని, పోలీసులను సంప్రదించాలి. సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- కోనారెడ్డి, ఎస్సై, పెద్దకొడప్‌గల్

వ్యవసాయాధికారుల సూచన మేరకే

పంటలను సాగు చేయాలి

భిక్కనూరు, జూన్ 18 : వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెప్పిన విధంగానే రైతులు తమ పంటలను వేసుకోవాలని అధికారులు సూచించారు. భిక్కనూరు రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రాధారెడ్డి, ఏఈవోలు వినోద్‌గౌడ్, రజిత, ఆనంద్, అఖిల, రైతులు పాల్గొన్నారు.



భిక్కనూరు రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న డీఏవో భాగ్యలక్ష్మి

రేషన్ షాపు ఏర్పాటు చేయాలని వినతి

భిక్కనూరు, జూన్ 18 : మండల కేంద్రంలోని దళిత వాడలో రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు సమాచారం హక్కు చట్టం జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. భిక్కనూరులోని 15, 16వ వార్డుల్లో రేషన్ షాప్ లేనందున ఇక్కడి ప్రజలు రేషన్ బియ్యం కోసం సుమారు 1.5 కిలో మీటరు నడవాల్సి వస్తుందని, ఇక్కడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇక్కడ వెంటనే రేషన్ షాపును ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో గోసు రమేశ్, కర్రోళ్ల రాజు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సమాచార హక్కు జిల్లా ప్రతినిధి రవీందర్

నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని

విజయవంతం చేయాలి

కామారెడ్డి, జూన్ 18 : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీన నులిపురుగుల నివారణ మాత్రలను జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుంచి 19 సంవత్సరాలు ఉన్న పిల్లలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొని నులి పురుగులతో సంభవించే వ్యాధులకు దూరంగా ఉండి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

బీర్కూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు స్వాతి, ప్రీతి

బాన్సువాడ, జూన్ 18 : బీర్కూర్‌లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో మంగళవారం మహిళలకు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ లు స్వాతి, ప్రీతి మహిళలకు గర్భసంచి, రొమ్ము క్యాన్సర్, గొంతుక్యాన్సర్ తదితర వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. మహిళల ఆరోగ్యం కోసం సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నర్సమ్మ, సుశీల తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి, జూన్ 18 : సఖీ కేంద్రంలో వర్కర్ పోస్టుని భర్తీ చేసేందుకు అర్హత ఉన్న మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పద్మపాని సొసైటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్సీ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 08468-223232, 73862 76181 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బ్యాగులు, నోటుబుక్కులు అందజేత

దేశాయిపేట్ విద్యార్థులకు నోటుబుక్కులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బాన్సువాడ రూరల్, జూన్ 18 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, నోటు బుక్కులు, పెన్నులు, పలకలను ప్రధానోపాధ్యాయుడు నరేందర్ మంగళవారం అందజేశారు. దుర్కి గ్రామానికి చెందిన సిద్ధార్థ, అతిథిల కూతురు రియాన్సిక అక్షరాభ్యాసాన్ని పురస్కరించుకొని వంద మంది విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్కులు, పెన్నులు, పలకలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరేందర్ మాట్లాడుతూ.. కూతురు అక్షరాభ్యాసం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటుబుక్కులు, బ్యాగులు అందజేయడం హర్షణీయమని, తల్లిదండ్రులకు పాఠశాల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సంగమేశ్వర్, రాజు, అశోక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురికి నీరు .. ఇబ్బందుల్లో వాహనదారులు

తిప్పారం రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు

గాంధారి, జూన్ 18: మండల కేంద్రంలోని తిప్పారం గ్రామానికి వెళ్లే రోడ్డుపై చాలా రోజుల నుంచి మురికి నీరు ప్రవహిస్తున్నా పట్టించుకునే వారులేరు. తిప్పారం రోడ్డు మీదుగా తిప్పారం, తిప్పారం తండా, సోమారం తండా, బుర్గుల్, బొప్పజివాడి, ఉత్తునూరు తదితర గ్రామాలకు ప్రతి రోజూ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై నిలిచిన మురికి నీటిలో నుంచి వాహనాలు వెళ్తున్నప్పుడు మురికినీరు రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వారిపై పడుతున్నది. మురికి నీరు ఉన్న ప్రదేశంలోనే ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు ఉన్నాయి. హాస్టల్ విద్యార్థులు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురికి నీరు నిల్వ కుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శరత్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 18: మండలంలోని మత్తమాల పీహెచ్‌సీలో డాక్టర్ శరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలకు అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. దీంతోపాటు జూన్ 20వ తేదీన నిర్వహించే నులిపురుగుల నివారణ దినోత్సవంపై పలు అంశాలను వివరించారు. అల్బెండజోల్ మాత్రల వేసుకోవడంతో ఆరోగ్యవంతులుగా తయారవుతారని అన్నారు. నులిపురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనతతో అలసటగా ఉంటారన్నారు. శారీరక పెరుగుదల, మానసిక అభివృద్ధి మందకొడిగా ఉంటుందని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలను తప్పకుండా వేసుకోవాలని సూచించారు. సమావేశంలో హెచ్‌ఈవో త్రివిక్రమాచారి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దైవచింతనతో మనశ్శాంతి

జగద్గురు నరేంద్రాచార్య మహరాజ్

జగద్గురు నరేంద్రాచార్య మహరాజ్ ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే షిండే

మద్నూర్, జూన్18: దైవచింతనతో మనశ్శాంతి లభిస్తుందని జగద్గురు నరేంద్రాచార్య మహరాజ్ అన్నారు. జుక్కల్ మండలంలోని దోస్‌పల్లి గ్రామంలోని స్వామీజీ ఉపపీఠంలో మంగళవారం నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, భక్తి కార్యాలు చేపట్టాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొని స్వామీజీకి హారతి ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణంలోని చెత్తను తొలగిస్తున్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్

క్రీడా ప్రాంగణం క్లీన్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

లింగంపేట, జూన్ 18: మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణాన్ని పంచాయతీ అధికారులు మంగళవారం శుభ్రం చేశారు. 'డంపింగ్ యార్డులా మారిన క్రీడా ప్రాంగణం' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో మంగళవారం ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. క్రీడా ప్రాంగణంలో వేసిన చెత్తను తొలగించారు. పంచాయతీ ట్రాక్టర్‌తో శుభ్రం చేయించారు. క్రీడా ప్రాంగణంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు తెలిపారు.

ఖాళీ కడుపుతో

అల్బెండజోల్ మాత్రలు వేసుకోవద్దు

డోంగ్లీ, జూన్ 18: అల్బెండజోల్ మాత్రలను ఖాళీ కడుపుతో వేసుకోవద్దని డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి శ్రీలేఖ అన్నారు. డోంగ్లీ పీహెచ్‌సీలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 20వ తేదీన 19 ఏండ్లలోపు వారందరికీ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. రెండేండ్లలోపు వారికి 200ఎంజీ, ఆపై వయస్సు వారికి 400ఎంజీ మాత్రలు వేయాలన్నారు. మాత్రలను నమిలి మింగమని చెప్పాలన్నారు. సమావేశంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీలేఖ

పొంచి ఉన్న ప్రమాదం

నాగిరెడ్డిపేట, జూన్ 18: మండల పరిషత్ కార్యాలయం పక్కన గ్రంథాలయం, ఈజీఎస్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో సెప్టిక్ ట్యాంకుకు గుంత పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ దారి గుండా పదుల సంఖ్యలో వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల ఒకరు గుంతలో పడి గాయపడ్డారు. సెప్టిక్ ట్యాంకు పదిఫీట్ల లోతు వరకు ఉండడంతో వాహనాలు, మనుషులు అదుపుతప్పి పడిపోతే.. ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొని ఉన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం పక్కన ప్రమాదకరంగా మారిన గుంత

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్; డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

పేట్‌సంగెంలో కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్‌రావు

డీపీవో శ్రీనివాస్‌రావు

గాంధారి, జూన్ 18: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని పేట్ సంగెం గ్రామాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో మొక్కల సంరక్షణ చేపట్టాలని సూచించారు. కంపోస్టు షెడ్‌లో సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఆస్తిపన్ను బకాయి లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి అరుణ్‌ను ఆదేశించారు. వానకాలం నేపథ్యంలో డ్రైనేజీలు శుభ్రం చేయించాలని సూచించారు. ఆయనవెంట ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరుణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులందరికీ త్వరగా యూనిఫామ్‌లు అందజేయాలి

రామారెడ్డి, జూన్ 18: విద్యార్థులకు త్వరగా వందశాతం యూనిఫామ్‌లను అందజేయాలని ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయాన్ని ఎన్ఆర్ఈజీఎస్ అధికారి ధర్మారెడ్డితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ మహిళా సమాఖ్య సభ్యులు కుడుతున్న దుస్తులను పరిశీలించారు. ఏపీఎం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 80శాతం దుస్తులను విద్యాశాఖ అధికారులకు అందజేశామని తెలిపారు. మిగిలిన వాటిని కూడా త్వరలో కుట్టి అందజేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ

పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్న జ్ఞాన వికాస భారతి సేవా సంస్థ బాధ్యులు

లింగంపేట, జూన్ 18: మండలంలోని పోల్కంపేట గ్రామ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జ్ఞాన వికాస భారతి సేవా సంస్థ సభ్యులు పెన్నులు, పెన్సిళ్లు మంగళవారం పంపిణీ చేశారు. సేవా సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయురాలు శ్వేత, సంస్థ ప్రతినిధులు రామానుజాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.